## క్లుప్తంగా

### వీధి బాలలను బడిలో చేర్పించాలి



పిల్లలను బడిలో చేర్పిస్తున్న సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ లింగన్న

గోనెగండ్ల: బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ లింగన్న కోరారు. సోమవారం ఆయన బడి బయట ఉన్న పిల్లలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, ఇందుకోసం వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. అలాగే విద్యార్థులకు మంచి పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పినందుకు ఎంఈఓ నీలకంఠ సీఆర్పీఎఫ్ లింగన్నను అభినందించారు. సీఆర్పీలు పుల్లన్న తదితరులు ఉన్నారు.

### 96 శాతం పింఛన్ల పంపిణీ



హైదరాబాద్‌కు వెళ్లి భాస్కర్‌కు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భీమేష్

తుగ్గలి: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ చురుగ్గా జరుగుతోంది. ఈ నెల 7,540 మందికి పింఛన్లు అందించేందుకు రూ.2,12,47,500 సొమ్ము విడుదలైంది. వాటిలో కొత్తగా మంజూరైన 169 పింఛన్లు ఉన్నాయి. నాలుగు రోజులుగా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. అనారోగ్యంతో ఇతర రాష్ట్రాల్లో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి వలంటీర్లు అక్కడికే వెళ్లి పింఛన్లు అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో ఉంటున్న మామిల్ల కుంట భాస్కర్‌కు కొత్తగా దివ్యాంగ పింఛన్ మంజూరైంది. సోమవారం వలంటీర్ భీమేష్ హైదరాబాద్ వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ సొమ్ము రూ.3 వేలు అందజేసి శభాష్ అనిపించుకున్నారు.

### జగనన్న కాలనీలో నీటి సౌకర్యం



స్థలాలను పరిశీలిస్తున్న డీఈ, జెడ్పీటీసీ సభ్యుడు

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో నీటి సౌకర్యం కల్పించేందుకు కోటి రూపాయలు నిధులు మంజూరు చేసిందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని మద్దికెర, పెరవలి జగనన్న కాలనీల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించేందుకు స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఇంటింటికీ కొళాయి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఏఈ మయాంక్, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి వెంట ఉన్నారు.

### వైభవంగా బసవేశ్వర ఉత్సవాలు



ఊరేగింపుగా వస్తున్న భక్తులు

మద్దికెర: శ్రావణమాసం పురస్కరించుకొని బసవేశ్వర దేవాలయంలో స్వామివారికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడవ సోమవారం సందర్భంగా గ్రామానికి 4 కి.మీ దూరంలో ఉన్న బుగ్గ సంగమేశ్వరం నుంచి ఎద్దుల బండ్లు, కలశాలతో నీటిని తీసుకొని స్వామి వారికి పోసుకుంటూ నృత్యాలు చేసుకుంటూ పురవీధుల గుండా నందికోలు ఆడుతూ చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. భక్తులకు అన్నదానం చేశారు.

### శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

దేవనకొండ: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. పైనుంచి పెచ్చులు ఊడి పడుతుండడంతో కార్యాలయంలో పనిచేసేందుకు రెవెన్యూ సిబ్బంది జంకుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయం అంతా నీరు దిగి ఉద్యోగులు కూర్చోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. భవనం ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టేలా చూడాలని కోరుతున్నారు.

# నాడు-నేడు ప్రగతి చూడు

- రూపురేఖలు మారిన ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాల
- రూ.69 లక్షలతో విద్యార్థులకు సౌకర్యాలు
- కాంపౌండ్ వాల్, టాయ్‌లెట్స్, గ్రౌండ్ సదుపాయం

ఆస్పరి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపురేఖలే మారిపోయాయి. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.69 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో కళాశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశా రు. సకల హంగులతో కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఆస్పరిలో 2009 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. ఆస్పరి పంచాయతీ వారు కళాశాలకు ఎకరం పొలం కేటాయించారు. కళాశాల మంజూరైందే కానీ విద్యార్థులకు, అధ్యాపకులకు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. టీడీపీ ప్రభుత్వంలో కళాశాల భవనం నిర్మించారే గానీ ఎలాంటి సదుపాయాలు చేపట్టలేదు. విద్యార్థులు కింద కూర్చొని చదువుకునే వారు. కళాశాల ప్రాంగణంలో బండ రాళ్లు, ముళ్ల కంపలు ఉండడం వల్ల విద్యార్థులు ఆడుకోవడానికి వీలుండేది కాదు. పైగా కళాశాల పక్కనే పొలాలు ఉండడం వల్ల నిత్యం పాములు, తేళ్లు వస్తుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు భయాందోళనకు గురయ్యేవారు. మందు బాబులు మద్యం సేవించి అక్కడే సీసాలు అక్కడే పగులగొట్టి వెళ్లే వారు. ప్రస్తుతం నాడు–నేడు కార్యక్రమం కింద నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంతో కళాశాల ఆదర్శంగా రూపుది ద్దుకుంది. మైదానంలో కంప చెట్లు, బండ రాళ్లను తొలగించి ఆట స్థలంగా మార్చారు. చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించడంతో మైదానంలోనే విద్యార్థులు ఆటలాడుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధ్యాన్యత ఇస్తూ నాడు–నేడు ద్వారా నిధులు కేటాంచడంతో కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సకల సౌకర్యాలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో కాంపౌండ్ వాల్, టాయ్‌లెట్స్, నీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యాం, విద్యార్థులకు వంద కొత్త బెంచీలు, పేయింటింగ్స్, నేలపై బండ పరుపుతో పాటు చిన్న చిన్న మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ప్రస్తుతం 160 మంది విద్యార్థులు, 11 మంది అధ్యాపకులు ఉన్నారు. కళాశాలలో పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం

#### చాలా సంతోషంగా ఉంది



నాడు– నేడు కింద చేపట్టిన పనులతో మా కళాశాల రూపురేఖలే మారిపోయాయి. కళాశాల పక్కనే పొలాలు, పెరిగిన ముళ్ల కంపలు ఉండడంతో ఇబ్బందిగా ఉండేది. ఎక్కడ నుంచి పాములు, తేళ్లు వస్తాయోనని తరగతి గదిలో కర్రలు పెట్టుకునే వాళ్లం. కళాశాల ఇలా మారిపోతుందని అనుకోలేదు. కాంపౌండ్ వాల్ నిర్మాణం వల్ల ఇప్పుడు ఆ భయం లేదు. విద్యార్థులు కూడా గ్రౌండ్‌లో ఆడుకుంటున్నారు. పనులన్నీ పూర్తయ్యాయి. చిన్న చిన్న మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. కళాశాలకు నిధులు కేటాయించి పనులు చేయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. – లక్ష్మీ నరసింహులు, ప్రిన్సిపాల్





నాడు మైదానంలో బండ రాళ్లు. నేడు - సౌకర్యవంతంగా ఉన్న మైదానంలో ఆడుకుంటున్న విద్యార్థులు





నాడు - నేలపై కూర్చొని చదువులు    నేడు- విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు

### సూక్ష్మసేద్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏపీడీ కృష్ణారెడ్డి

మద్దికెర: ప్రతి రైతు అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సూక్ష్మసేద్యంపై దృష్టి సారించాలని జిల్లా పథక సహాయ సంచాలకులు కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలో సూక్ష్మసేద్యం విధానంలో సాగుచేసిన పైర్లను ఆయన పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం సాగు నీటి పథకం ద్వారా అర్హత కలిగిన రైతులకు డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్ల యూనిట్లను సబ్సిడీపై అందిస్తుందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మండలంలో 327 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్ల కొరకు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 77 హెక్టార్ల మేరకు పరికరాలు మంజూరు చేసినట్లు చెప్పారు. తక్కువ నీటి వినియోగంతో మంచి దిగుబడులు సాధించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఏఓ రవి, వీఏఏలు జాకీర్, రాణి తదితరులు ఉన్నారు.

### ఈ-కేవైసీ చేయించుకోవాలి

దేవనకొండ: మండలంలో పంట నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏఓ సురేష్‌బాబు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 74 వేల ఎకరాల్లో పంటలు సాగైనట్లు తెలిపారు. ఇప్పటివరకు 40 వేల ఎకరాల్లో ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. పంట నమోదు చేసుకున్న రైతులు సమీప ఆర్‌బీకేలకు వెళ్లి ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ–కేవైసీ చేయించుకుంటే భవిష్యత్‌లో క్రాప్ ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ సబ్సిడీలు అందుతాయన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్



కొత్తగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎవరి సిఫారసు లేకుండా పింఛన్లను మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో కొత్తగా 402 మందికి పింఛన్లు మంజూరు కాగా సోమవారం సాయంత్రం తన నివాసంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పింఛన్లు మంజూరయ్యేవి కావన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి పింఛన్లు మంజూరు చేయించడంతో పాటు ఇంటి వద్దకే అందిస్తున్నారని వివరించారు. అవినీతికి ఆస్కారం లేకుండా నాలుగేళ్లుగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు రుద్రాక్షాల బజారి, కె.విశ్వనాథ్, సుధాకర్‌రెడ్డి, గోనెగండ్ల ఎంపీపీ నసురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కన్వీనర్లు, గృహ సారథులకు బీమా

తుగ్గలి: గ్రామ/వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆ పార్టీ మండల, సచివాలయ కన్వీనర్లు జిట్టా నాగేష్, హనుమంతు అన్నారు. సోమవారం తుగ్గలిలో పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు సచివాలయ కన్వీనర్లకు జీవిత బీమా నమోదు చేసినట్లు చెప్పారు. గృహ సారథులు కూడా తమ ఆధార్ కార్డు జిరాక్సు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, నామినీ వివరాలు అందజేయాలని కోరారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ నాయకులు దివంగత ప్రతాపరెడ్డి, ప్రహ్లాదరెడ్డి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జగన్నాథరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ప్రతాపరెడ్డి, ప్రహ్లాదరెడ్డి చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

### కరువు మండలంగా ప్రకటించాలి

గోనెగండ్ల: ప్రస్తుత ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, గోనెగండ్లను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం సూపరింటిండెంట్ బాబు భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఎల్.నగరం ఉప సర్పంచ్‌గా మహబూబ్ బాషా



షేక్ మహబూబ్ బాషాకు డిక్లరేషన్ అందిస్తున్న ఎన్నికల అధికారి నరసింహులు



కోతిరాళ్ల ఉప సర్పంచ్ నాగరాజును అభినందిస్తున్న సర్పంచ్ అంజినయ్య తదితరులు

వెల్దుర్తి: ఎల్.నగరం గ్రామ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు, 3వ వార్డు మెంబర్ షేక్ మహబూబ్ బాషా ఎన్నికయ్యారు. సోమవారం ఎన్నికల అధికారి/ఈఓఆర్డీ నరసింహులు సర్పంచ్ మహేశ్వరి ఆధ్వర్యంలో, సెక్రటరీ దేవమ్మ పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు. ఎల్ నగరం గ్రామ పంచాయతీలోనే మజారా గ్రామాలు పిక్కిలివాని పల్లె, ఎల్ కొట్టాల, ఎల్ తండా, దాసరదొడ్డి తండా ఉండగా 13 మంది వార్డు మెంబర్లు ఉన్నారు. సర్పంచ్‌తో సహా వార్డు మెంబర్లందరూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడం విశేషం. పిక్కిలివాని పల్లెకు చెందిన వార్డు మెంబరు/ఉప సర్పంచ్ మృతి చెందడంతో ఖాళీ అయిన స్థానానికి ఇటీవల ఆయన కుమారుడు నక్క లోకేశ్ ఎన్నికయ్యాడు. ఆయన ఎల్ నగరం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషాను ఉప సర్పంచ్‌గా ప్రతిపాదించగా, మిగిలిన 10 మంది వార్డు మెంబర్లు ఆమోదించారు. దీంతో షేక్ మహబూబ్ బాషా ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ఎన్నకల అధికారి ధ్రువీకరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు సమీర్‌కుమార్ రెడ్డి సమక్షంలో ఈఓఆర్డీ చేతుల మీదుగా ఆయన డిక్లరేషన్ అందుకున్నాడు. ప్రజా సేవలో ముందుంటానని ఉప సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పంచాయతీలో కొత్తగా మంజూరైన 15 పింఛన్లను వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు అందించారు.

#### రెండు గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కోతిరాళ్ల, పుచ్చకాయలమాడ గ్రామాల్లో ఉపసర్పంచ్‌లు రాజీనామా చేయడంతో వారి స్థానానికి సోమవారం ఎన్నిక జరిగింది. కోతిరాళ్ల మజారా గ్రామ పంచాయతీ కనకదిన్నె గ్రామానికి చెందిన ఉప్పర నాగరాజును, పుచ్చకాయలమాడ గ్రామంలో చింతగింజల కిష్టప్పలను ఉప సర్పంచ్‌లుగా వార్డు సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి అధికారులు డిక్లరేషన్ అందజేశారు. గ్రామపెద్దలు నూతన ఉపసర్పంచ్‌లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మురళీ మోహన్ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

### కళ్లను కాపాడుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు మంచి పోషకాహారం తీసుకొని తమ కళ్ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక చిరంజీవి కంటి ఆస్పత్రి వైద్యురాలు అనూష, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చిరంజీవి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ కళ్లలో ఇన్‌ఫెక్షన్ లాంటివి వస్తే విద్యార్థులు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని కోరారు. మొబైల్ ఫోన్లను అతిగా ఉపయోగించడం ద్వారా కూడా కంటి సమస్యలు ఉత్పన్నమౌతాయని పేర్కొన్నారు. కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఐదుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

ఆలూరు రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అరికెర గ్రామ సచివాలయ ఉద్యోగులు ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆలూరు ఎంపీడీఓ అల్లబకష్ సోమవారం వెల్లడించారు. ఆ గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న మహిళా పోలీసు విజయ, గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ లికిత్, హార్టికల్చర్ అసిస్టెంట్ లక్ష్మన్న, ఏఎన్ఎం నాగమణి, సర్వేయర్ రాకేష్‌కు నోటీసు జారీ చేశామన్నారు. మండలంలోని 17 సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయండి

ఆలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్లు, గ్రామ ఐక్య మండలం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ రంగమ్మ సూచించారు. ఆమె సోమవారం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను వివరించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. మండలంలో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిల పనులను పూర్తి చేసినట్లు వివరించారు. అలాగే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించేలా జల్ జీవన్ మిషన్ పథకం నిధులతో ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### కోలుకోలేక వ్యక్తి మృతి

హొళగుంద: బైక్ ప్రమాదంలో గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమ్మతగేరి గ్రామానికి చెందిన లక్ష్మన్న (35) కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. సదరు వ్యక్తి గత నెల 30న సమ్మతగేరి సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు కర్నూలు పెద్దాసుపత్రిలో చేర్పించగా సోమవారం కోలుకోలేక మృతి చెందాడు. భార్య మహాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### జగనన్న పాలనలో భరోసా

హొళగుంద: జగనన్న పాలనలో పేదలకు భరోసా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు కురువ రంగస్వామి, మల్లికార్జునరెడ్డి, శంకర్ తదితరులు అన్నారు. గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో పింఛన్లు పొందేందుకు వృద్ధులు, దివ్యాంగులు నానా అవస్థలు పడేవారని, ప్రస్తుతం ఇంటి వద్దకే పింఛన్ అందిస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మళ్లీ జగనన్న సీఎం కావాలని అందరూ దీవిస్తున్నారని, ఇలాంటి పాలన దేశంలో ఎక్కడా లేదన్నారు. నాయకులు కురువ తిక్కన్న తదితరులు ఉన్నారు.

## రమణీయం.. వీరభద్రుని కుంభోత్సవం



పెద్దహ్యాటలో దైవ వచనాలు చెబుతున్న వీరభద్రస్వామి వేషాధారి

హొళగుంద: మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామంలో శ్రావణ మాసం మూడవ సోమవారంలో భాగంగా వీరభద్రేశ్వరస్వామి కుంభోత్సవ కార్యక్రమం అత్యంత రమణీయంగా జరిగింది. పచ్చని కొండ దిగువన ఉన్న పెద్దహ్యాట సోమవారం దేవుని నామస్మరణతో మార్మోగింది. ఏటా జరిగే ఈ కార్యక్రమానికి స్థానికులే గాకుండా బంధువులు, చుట్టుపక్కల గ్రామస్తులు, ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ ఇలవేల్పు వీరభద్రేశ్వరుడిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. సోమవారం తెల్లవారుజామున గ్రామ శివారులో గంగి పూజ, కుంభాల ఊరేగింపు, శ్రీవీరభద్రుని వేషాధారి వీరకాసి దైవ వచనాలు, నందికోలు సేవ తదితర కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం స్వామి వారి ఆలయంలో రుద్రాభిషేక పూజలు జరిగాయి. హాజరైన స్వాములు భక్తులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. సమృద్ధిగా వర్షాలతో పాడి పంటలతో గ్రామం కళకళలాడుతూ ఉండాలని ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### 4 రోజుల పాటు గణేష్ ఉత్సవాలు



మాట్లాడుతున్న వినాయక కేంద్ర సమితి సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని స్థానిక గణేష్ మహోన్నత కేంద్ర సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ శివకుమార్, యూకే రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సుశీలమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర సమితి సభ్యులు మాట్లాడారు. పట్టణ ప్రజలు ఈ నెల 18న వినాయక చవితి,విగ్రహాల ప్రతిష్ట, 21న నిమజ్జనం నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు ప్రకాష్‌జైన్ తెలిపారు. వినాయకుడిని ప్రతిష్ఠించే బృందాలు స్థానిక కుర్ణి కళ్యాణ మండపంలో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు పేర్లను నమోదు చేసుకోవాలని కౌన్సిలర్, సమితి సభ్యుడు కామర్తి నాగేషప్ప సూచించారు.

## పంట నమోదు పక్కాగా చేపట్టండి



కృష్ణగిరి గ్రామ పొలాల్లో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

కృష్ణగిరి: రైతులు సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియను పక్కాగా చేపట్టాలని ఏఓ వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. కృష్ణగిరి గ్రామ పొలాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ ఏడాది జియో ఫెన్సింగ్ సిస్టమ్‌లో అర్హులైన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా జాగ్రత్తగా పంట నమోదు చేపట్టాలని సూచించారు. రైతులు సాగుచేసిన ప్రతి ఎకరాను నమోదు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మండలంలో ఇప్పటివరకు 13 వేల ఎకరాల్లో పంటనమోదు పూర్తయ్యిందని వెల్లడించారు.

### గూళ్యంలో వైద్య శిబిరం



గూళ్యంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో సోమవారం హాలహర్వి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తిమ్మన్న యాదవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇప్పటివరకు 40 మంది వరకు అతిసార వ్యాధితో బాధపడుతున్నారు. కలుషితమైన నీరు తాగడం వల్ల ఈ సమస్య వచ్చిందని చెప్పారు. ఇలాంటి సీజనల్ జబ్బులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు.

#### ప్రజలతో సమావేశమైన ఎస్ఐ

మండలంలోని గూళ్యం గ్రామంలో ప్రజలతో ఎస్ఐ నాగేంద్ర సమావేశమయ్యారు. ప్రజలు కలుషిత నీటిని తాగరాదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. నీరు ఎక్కడ కలుషితమవుతున్నాయో వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పరిశీలిస్తున్నారన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

## ఊరటనిచ్చిన వర్షం



టి.గోకులపాడు వద్ద కంది పంటలో నిలిచిన నీరు

తుగ్గలి: మండలంలో ఆదివారం అర్ధరాత్రి మోస్తరు వర్షం కురిసింది. 62.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ సీజన్‌లో ఇంత వర్షం కురవడం ఇదే ప్రథమం. పలుచోట్ల చిన్న చిన్న కుంటలు నిండాయి. చెరువులకు వర్షపు నీరు చేరుతోంది. సాగు చేసినప్పటి నుంచి తీవ్ర వర్షాభావంతో పంట ఎదుగుదల లోపించింది. పంటలు వాడుతున్న దశలో పదునైన వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

#### ఆలూరులో 30 ఎంఎం వర్షం

ఆలూరు రూరల్: గత నెల రోజుల నుంచి వర్షాలు కురవక రైతులు, ప్రజలు అల్లాడుతున్న తరుణంలో ఆదివారం అర్ధరాత్రి ఆలూరు మండలంలో కురిసిన వర్షం పైర్లకు జీవం పోసింది. ఆదివారం రాత్రి మండలంలో 30 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా పత్తి, వేరుశనగ పంటలు సాగు చేశారు. పంటలు ఎండు దశకు చేరుకున్న సమయంలో వర్షం రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

#### ప్రజలను అప్రమత్తం చేయండి
– తహసీల్దార్ రామాంజనేయులు

రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలను వీఆర్వోలు అప్రమత్తం చేయాలని తహసీల్దార్ రామాంజినేయులు సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. మట్టి మిద్దెలు, గోడలు దెబ్బతిన్న పాత ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలన్నారు. వంకలు, వాగులు పొంగి పొర్లుతున్న సమయంలో దాటేందుకు ప్రయత్నించరాదని సూచించారు.